క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



రాజాం: పెనుబాక పాఠశాలలో తెలుగు తల్లికి నమస్కరిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం/బొబ్బిలిరూరల్/రాజాం/సంతకవిటి: మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులంతా తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని, అమ్మ వంటి కమ్మనైన తెలుగు భాష మనకు ఉండడం గొప్ప అదృష్టమన్నారు. ప్రతిఒక్కరూ మాతృభాష పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

వంగర: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని సింహాచలం తదితరులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతు తెలపాలని, మొదటి ప్రాధాన్యతా ఓటు ఆయనకు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో బసవ రాజు, ఎంపీటీసీ కనగల పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని వాల్తేరు, చిత్తారపురం, కావలి, సిరిపురం తదితర గ్రామాల్లో యూటీఎఫ్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి, గెలిపించాలని కోరారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తు ఖానా వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ కొండలరావు సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలను ఆపి, వాహన ధ్రువపత్రాలు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. బకాయి చలానాలు ఉన్నవారితో చలానాలు కట్టించుకున్నారు.

హౌసింగ్ కార్యాలయానికి తాళం



కార్యాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యం

బాడంగి: స్థానిక హౌసింగ్ కార్యాలయానికి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తాళాలు వేసి ఉన్నాయని సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆరోపించారు. మండలంలోని మల్లంపేటలో జరిగిన సిమెంట్ అవకతవకలపై లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరేందుకు తాను కార్యాలయానికి వెళ్తే ఆ సమయంలో ఆఫీస్‌కు తాళాలు వేసి ఉన్నాయన్నారు. ఉన్నత స్థాయి అధికారులే ఇలా ఉంటే వారి కింది స్థాయి ఉద్యోగులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉండరని విమర్శించారు.

మెనూ అమలు చేయాలి

రాజాం: మధ్యాహ్న భోజన పథకం అమలులో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. స్థానిక పట్టణంలోని కొత్తవలస ఎంపీయూపీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి పరిశీలించిన ఆయన.. వంటకాలు రుచికరంగా ఉండాలని తెలిపారు.

నూనెల తయారీపై అవగాహన

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్‌లోని ఓ ఆయిల్ మిల్లులో వంటనూనెల తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నువ్వులు, వేరుశనగ పండిస్తున్న రైతులంతా తమ పంటలను దళారులకు విక్రయించుకుండా నేరుగా ఆయిల్ మిల్లులకు విక్రయించాలని పార్వతీపురం మన్య జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు.

‘మంద’ నిలబెడదాం.. భూసారం పెంచుదాం!



సంతకవిటి: మద్దూరుపేట పాలాల్లో వేసిన గొర్రెల మంద

- గొర్రెల మందకు తగ్గని ఆదరణ
- జీవాల విసర్జితాలతో భూసారం
- పొలాల్లో మంద వేసేందుకు రైతుల ఆసక్తి

సంతకవిటి: పంటలకు వేసే ఎరువుల ధరలు ఏటా పెరిగిపోవడంతో రైతులంతా సేంద్రియ ఎరువులు వేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా గొర్రెల మంద పొలాల్లో నిలబెట్టుకుని, వాటి విసర్జితాలు నేలలో కలిసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత పొలాల్లో ఎక్కడ చూసినా జీవాల విసర్జితాల కోసం ఆవుల మంద, గొర్రెల మంద వేసుకుంటున్న దృశ్యాలు విరివిగా కనిపిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు అటు భూసారం పెంచుకునేందుకు, ఇటు పంటలు బాగా పండించుకునేందుకు ఉపయోగపడుతుండడంతో చాలా చోట్ల రైతులు గొర్రెల కాపర్లుతో మాట్లాడి, మంద వేయించుకుంటున్నారు. అధునాత పద్ధతులతో కొత్తపుంతలు తొక్కుతున్న వ్యవసాయ రంగంలో ఇలాంటి పాత విధానాల వైపు రైతులు మక్కువ చూపిస్తుండ డానికి కారణం వ్యవసాయ ఖర్చులు తగ్గించుకునేందుకేనని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా సేంద్రియ ఎరువే పంటలకు మేలు అని రైతులను ప్రోత్సహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం, లావేరు మండలాల నుంచి, విజయనగరం జిల్లాలోని తెర్లాం మండలం డి.గదబవలస, అరసబలగ, సంతకవిటి మండలం కష్టంవలస, శంకరపేట ప్రాంతాల నుంచి గొర్రెల మందలు పరిసర ప్రాంతాలకు చేరుకుని, వేలాది ఎకరాల్లో మంద కట్టడం ప్రస్తుతం జరుగుతోంది. ఇలా గొర్రెల మంద వేసిన వారికి డబ్బులు లేదా బియ్యం, పప్పు, చింతపండు, కూరగాయలు ఇలా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇస్తారు.

ఆదరణ పెరిగింది..



రైతులు ఇచ్చే డబ్బులు గిట్టుబాటు కాకపోయినా మంద వేస్తున్నాం. దూర ప్రాంతాలకు రోజుల తరబడి నడుచుకుంటూ మందను తోడ్కొని వెళ్తున్నాం. రాత్రిళ్లు అక్కడే వంట చేసుకుని ఉంటున్నాం. కష్టమైనా జీవాలకూ, తమకు పోషణ దొరుకుతుందని చేస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో మందకు అయితే ఆదరణ పెరిగింది.

– కె.పోలయ్య, డి.గదబవలస, తెర్లాం మండలం

ఎరువుల ఖర్చు తగ్గుతుంది..



పొలాల్లో గొర్రెలు, మేకల మందలు వేసుకోవడం ద్వారా పంటపొలాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. పంటలు కూడా బాగా పండుతాయి.

– ఎస్.వెంకటనాయుడు, రైతు, మద్దూరుపేట

‘అపరాలు’ తర్వాత..

ఏటా అపరాలు పంటలు పండిన తర్వాత గొర్రెల మందలు పొలాల్లో వేసుకుంటారు. అవి అప్పటికే పొలాల్లో మిగిలిన అపరాలు మొక్కలు బాగా తిని ఆ తర్వాత అవి వేసిన విసర్జితాలతో నేల సారవంతంగా మారుతుంది. గొర్రెలు, మేకలు వేసిన విసర్జితాలే ఎరువుగా ఉపయోగపడి ఆ తర్వాత పండించే పంటలు అధిక దిగుబడులు ఇస్తాయి. ఈ గొర్రెల మంద విధానం అటు గొర్రెలు, మేకలకు, ఇటు రైతాంగానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

జెడ్పీ చైర్మన్ పరామర్శ



అప్పలనాయుడును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

తెర్లాం: వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ప్రతినిధి బోను అప్పలనాయుడును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) శుక్రవారం పరామర్శించారు. మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన అప్పలనాయుడు గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్.. విశాఖపట్నం వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు



పామాయిల్ తోటలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

మెంటాడ: రాయితీపై అందిస్తున్న స్ప్రింక్లర్, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జేసీ సేతు మాధవన్ రైతులను కోరారు. మండలంలోని జక్కువ, జయితి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న పామాయిల్ పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేలా ఏపీ మైక్రో ఇరిగేషన్ శాఖ ద్వారా బిందు, తుంపర సేద్యాల పరికరాలను రాయితీపై అందించడం జరుగుతోందన్నారు. ఐదు ఎకరాలు లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, ఐదెకరాలు దాటి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందించడం జరుగుతుందని, అవసరమైన వారు ఉద్యాన శాఖ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఏవీఎస్‌వీ జమదగ్ని, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పీఎన్‌వీ లక్ష్మీనారాయణ, తహసీల్దారు కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో భానుమూర్తి, ఉద్యానవనశాఖాధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి

సంతకవిటి: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో వీవోఏలు, వెలుగు సిబ్బందితో కలిసి రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి.. మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రామ సంఘానికి ఇద్దరు చొప్పున సీఎంఈజీపీ పథకం కింద లబ్ధిదారులను గుర్తించి బ్యాంక్ అనుసంధానంతో 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. అలాగే అర్హత కలిగిన సంఘాలన్నింటికీ బ్యాంక్ లింకేజి రుణాలతో పాటు బ్యాంకర్స్‌తో మాట్లాడి పొదుపు చేయించిన మొత్తాన్ని విత్ డ్రా చేయించి అంతర్గత రుణాల కింద మొబైల్ బుక్ కీపింగ్‌లో నమోదు చేయాలన్నారు. స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాలు 100 శాతం వసూలు చేయాలన్నారు. సొంతిల్లు ఉండి నెలకు రూ.850 విద్యుత్ బిల్లు వచ్చిన వారికి పీఎం సూర్యఘర్ పథకం కింద రాయితీపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఆసక్తి ఉన్న సభ్యుల వివరాలు సేకరించాలన్నారు. లక్ష్యాలను మార్చి 15 నాటికి పూర్తి చేయని వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఏపీఎం కె.హేమలత, స్త్రీ నిధి మేనేజర్ వి.సుధాకర్, ఏపీఎం టి.దదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 17 మంది ఎంపిక



కంటి ఆపరేషన్లకు విజయనగరం బయలుదేరిన రోగులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 17 మంది కంటి రోగులను నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు వెంకటేష్, మనోజ్ఞరమణి తెలిపారు. పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది ఈ శిబిరాన్ని నిర్వహించారు. 45 మంది రోగులు శిబిరానికి హాజరై, వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని ఆపరేషన్ కోసం విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దు



సంఘం వీధిలో కాలువలోని మురుగును చూస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ఎక్కడపడితే అక్కడ చెత్త పారవేయవద్దని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక పట్టణంలోని కోరాడ, సంఘం వీధుల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. కాలువల్లో సిల్టు తొలగించకపోవడం, తాగునీటి పైపుల హెడ్‌లు కట్టకపోవడం, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వంటి వాటిని ఆమె గమనించి, పలు సూచనలు చేశారు. వీధుల్లో, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని, వీధుల్లోకి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త అందివ్వాలని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

బాడంగి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాట్సాప్ గవర్నెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఫోన్ నంబర్ 9552300009కు వాట్సాప్ మెసేజ్ చేస్తే ప్రభుత్వం అందిస్తున్న 158 సర్వీసులు ఉచితంగా పొందవచ్చన్నారు. భవిష్యత్‌లో ఈ సర్వీసులు వెయ్యి వరకు అందుబాటులోకి వస్తాయన్నారు.

23న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 23వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహిస్తున్నట్లు రారావే నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ‘మార్జింగోర్కి–అమ్మ నవల–ప్రాసంగికత’ అనే అంశంపై సమతం మహేశ్వరరావు ప్రసంగం చేయనున్నారన్నారు. ఈ సమావేశానికి సాహితీవేత్తలు, రచయితలు, కవులు, భాషాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

రైల్వేపాస్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి

తెర్లాం: దివ్యాంగులంతా రైల్వేపాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జె.త్రినాధరావు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. గతంలో దివ్యాంగులైన విద్యార్థులు పాస్‌ల కోసం రైల్వేస్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ప్రస్తుతం రైల్వే శాఖ ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను రూపొందించి, అందుబాటులో ఉంచిందన్నారు. పాసులు కావాలనుకునే వారంతా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి, దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

రామభద్రపురం: పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఆయన తనను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు గాను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవి మరింత బాధ్యతను పెంచిందన్నారు.

బాడంగి: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ మెంబర్‌గా బాడంగి మండలం, పెదపల్లికి చెందిన ఆవు సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బాడంగి: సొంత భూమి కలిగిన ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో కె.శిరీష్ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో భూ ఆధార్ నమోదు(ఫార్మర్ రిజిస్ట్రేషన్)ను ఆమె శుక్రవారం స్వయంగా పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ సంబంధిత పథకాలు, యంత్ర సామగ్రి కావాలనుకునే వారంతా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

వసతిగృహాల తనిఖీ

వంగర: మండలంలోని మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలికలు), వంగర కేజీబీవీని ఎస్‌ఐ షేక్ శంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. సందర్శకుల రికార్డులు, భద్రతా చర్యలు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా వసతిగృహాల వద్ద సంచరిస్తే తెలియజేయాలని చెప్పారు.

● పట్టు జారిందా.. ప్రాణం గోవిందా!



ఈ చిత్రంలో కనిపిస్తోంది.. తెర్లాం నుంచి రాజాం, పెరుమాళిలోని కళాశాలలకు బస్సులో వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు. చాలీచాలని బస్సులు ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలకు వెళ్లే సమయంలోనూ, కళాశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలోనూ దొరికిన బస్సును అందరూ ఎక్కేయడంతో ఇలా కిక్కిరిసి ప్రయాణించాల్సిన దుస్థితి. కొంతమంది అయితే పుట్‌బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అది చూసిన వారంతా ఈ ప్రయాణం.. ప్రమాదకరమని, పట్టు జారిందా.. ప్రాణం గోవిందా అని అంటున్నారు. స్టూడెంట్ స్పెషల్ బస్సులను పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

–తెర్లాం

● రోడ్డు బాగు చేయరూ?



రేగిడి మండలం, ఖండ్యాం నుంచి వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేటల మీదుగా ఉంగరాడమెట్టకు వెళ్లే రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురైంది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొత్త రోడ్డు వేయకపోయినా ఫర్వాలేదు.. కనీసం రోడ్డు అయినా బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

–రేగిడి

● పొంచి ఉన్న ప్రమాదం



బొబ్బిలి దాడితల్లి కోవెల వద్ద ప్రమాదం పొంచి ఉంది. అక్కడి తాగునీటి పైపు లీకేజీని అరికట్టేందుకు రోడ్డు పక్కనే ఉన్న పైపులైన్ మరమ్మతులు చేపట్టడానికి ఓ పెద్దగొయ్యి తీసేసి అలానే వదిలేశారు. ఇదే దారిలో ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఏ వాహనదారుడైనా అదుపు తప్పి గోతిలో పడినా గాయాలపాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా గోతిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

–బొబ్బిలి

ఇసుక రీచ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

- మండల సర్వసభ్య సమావేశంలో కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు

తెర్లాం: తమ గ్రామంలోని ఇసుక రీచ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ సత్యంనాయుడు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, ఇసుక తవ్వకానికి ఇచ్చిన అనుమతి కన్నా అధిక లోతులో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. స్పందించిన ఎంపీపీ.. తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌కు సంబంధించి, అన్ని విషయాలు మైనింగ్ అధికారులు చూస్తారని, సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో అరసబలగలో 20 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని, జేఎల్ఎం గ్రామానికి రావడం లేదని సర్పంచ్ సాయిరాం తెలిపారు. తెర్లాంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు మార్చాలని ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు తెలిపారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ భూములున్న ప్రతీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, సర్పంచ్ మధుసూదనరావు, ఏపీవో సుశీల, జెడ్పీటీసీ గర్భాపు లూర్దు, ఎంపీడీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.